

# కథా కౌముది

## ఎడం ఛాయా మల్లిక్

కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో
సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.

"**నువ్వు** స్వతహాగా కథకుడివైనందువలన నీకు ఎక్కువగా విశ్లేషించి చెప్పాల్సిన అవసరం లేదనుకుంటాను" అని నాతో సంభాషణ ప్రారంభించిన వ్యక్తి మా చిరకాల కుటుంబ మిత్రుడే కావడంతో ఈ ఉపోద్ఘాతం ఏ బృహద్భాతానికి దారితోస్తుందోనని నేను సంకోచించిన మాట వాస్తవం.

ఆ పల్లెటూరి చెరువుగట్టున రామాలయపు మండపంలో కూర్చుని ఉన్నాం, మేమిద్దరమూ. వేసవికాలం కావడం వలన పొద్దువాలినా యింకా చీకట్లు అలుముకోలేదు. చెరువులోని నీటి అలలే చల్లగాలి కెరటాలై మృదువుగా స్పృశిస్తూ సేద తీరుస్తున్నాడు.

రెండు నిమిషాల కాలం నిశ్శబ్ధంగా గడిచాక, మళ్ళీ తనే "క్రిందటి నెలలో పట్నం పనిమీద మీ యింటికొచ్చి నాల్రోజులు ఉన్నప్పుడు నేనో సంగతి గమనించాను. మీ యిద్దరి మధ్య ఏ విధమైన పొరపొచ్చాలూ లేవు. గత నలభై ఏళ్ళుగా మీరిద్దరూ కీచులాడుకోవడం మాకెవరికీ తెలీదు. సలక్షణంగా పిల్లలకి ఉద్యోగాలూ, పెళ్ళిళ్ళూ చేసి బాధ్యతలన్నీ తీర్చేసుకుని నిక్షేపంగా సొంత యింటిలో 'మిధునం' కథలో జంటలా ఏ బాదరాబందీ లేకుండా ఉన్నారు కానీ మీ యిద్దరి మధ్యా నాకేదో వెలితి కనిపించింది. ముభావంగా నువ్వూ, ముక్తసరిగా ఆవిడా!. ఇన్నేళ్ళ దాంపత్యం తర్వాత మీ మధ్య ఆ 'ఎడం' ఏమిటో ఎందుకో నాకేమాత్రం అర్ధం కావడంలేదు. ఏమై ఉంటుందంటావ్?"

అడిగిన వ్యక్తి నిజానికి మా అన్నయ్యకి స్నేహితుడు. నాక్కాదు. కానీ, గతంలో మా అన్నయ్యకీ, నాన్నకీ చెప్పుకోలేని ఇబ్బందులూ, ఆమెతో నా ప్రేమవ్యవహారంలో తప్పనిసరైన సలహా, సంప్రదింపూ ఈయన చొరవవల్లనే చక్కబడ్డాయి. అందువలన ఈయన పరాయి మనిషికాడు, నిజమే. అందుకే, నాకంతవరకూ అనుభవంలోకి రాని విషయాన్నొకదాన్ని శోధించి, వెలికి తీసి నా సమాధానాన్ని కోరినప్పుడు 'నీకెందుక'ని తిరస్కరించలేకపోయాను.

కానీ ఇప్పుడు కొత్తగా మొదలైన అలజడిని అదుపులో ఉంచేందుకు ప్రయత్నించే పనిలో భాగంగా గత జీవితాన్ని సింహావలోకనం చేసుకుంటూ ఇంతవరకూ గమనించని 'వెలితి'కి మూలాలు అన్వేషిస్తూ స్వగతంలా మాట్లాడసాగాను.

"మొదట్నుంచీ కుటుంబ బాధ్యతలేవీ తెలియకుండానే పెరిగాను నేను. అన్ని విషయాలూ నాన్నా, అన్నయ్యే చూసుకునేవారు. అందుకేనేమో కథలూ, కవితలూ రాసుకుంటూ భావకుడిగా ఉండిపోయాన్నేను. ఉద్యోగం వచ్చిన ఏడాదిలోనే నేను ప్రేమలో పడినప్పుడు అప్పుడే పెళ్ళేమిటని మావాళ్ళు అడ్డుపడితే నువ్వే వాళ్ళని ఒప్పించి, అంతా సానుకూల పర్చావు.

ఆమెను నేను ప్రేమించానని తెలుసు. అంతే. ఆమెకు నా పట్ల ఎలాంటి భావం వుందో తెలుసుకునే ప్రయత్నం చెయ్యలేదు నేను. నిన్ను మధ్యవర్తిగా పంపించి, నా ప్రేమకథని సుఖాంతం చేసుకున్నాను. కట్నం అడక్కుండా ఉద్యోగస్తుడైన అల్లుడు వస్తూంటే, ఎవరికి అభ్యంతరం ఉంటుంది?

ఇక ఆమె విషయం. జీవితంలో చదువూ, ఉద్యోగం తర్వాత సహజంగా జరిగే పరిణామంగానే వివాహాన్ని ఆమోదించింది. కానైతే అంతకాలం తన తండ్రికి చేదోడుగా తాను చేస్తున్న చిరుద్యోగాన్ని మరికొంతకాలం కొనసాగించి, ఆయనకి అండగా ఉంటానని మాత్రం చెప్పింది.

నేనందుకు ఒప్పుకోవడమే కాకుండా ఆమెకు మరింత సామర్థ్యాన్ని అందించాలని పదవతరగతితో ఆపేసిన చదువును మళ్ళీ ప్రారంభించమన్నాను. అందువల్ల ఆమె విద్యార్హత పెరిగి, మంచి ఉద్యోగాన్ని సంపాదించుకుంది.

ఛాందసభావాలు కల సమాజం నుంచి ఆమె భావ స్వాతంత్ర్యం పొందాలని, అభ్యుదయ సాహిత్యాన్ని ఆమెకు సమకూర్చాను.

ఆమె కూడా అన్నివిధాలా నాకు అనుకూలవతియై, నా బాధ్యతలన్నీ నేను సక్రమంగా నెరవేర్చడానికి ఎంతగానో సహకరించింది."

సరిగ్గా అక్కడే ఆయన అడ్డుతగిలాడు.

"అంతా బాగానే ఉంది. ఇదంతా నాకూ తెలుసు. మరి ఆ 'వెలితి' ఎక్కడ్నుంచి వచ్చింది?"

"అదే ఊహిస్తున్నాను. నేనింతవరకూ చెప్పినవి కేవలం నా పరంగానే ఉంది కదా! నాణానికి రెండో పార్శ్వాన్ని కూడా చూడందే 'సహజీవనా'న్ని ఎలా అర్థం చేసుకోగలం?

ఇప్పుడిప్పుడే నాకు తోస్తున్నది ఏమిటంటే నేనామెకు ఏమిచ్చానన్నదే ఆలోచిస్తున్నాను కానీ ఆమె ఏమి కోరుకుంటోందన్నది కాదు. నేనామెకు అవకాశాలిస్తే, ఆమె నాకు సహకారాన్నందించి బదులు తీర్చుకుంది. అంతేకానీ, ఆమె తనకై తాను ఒక స్వతంత్రవ్యక్తిగా తనకే తెలీని తన అంతరాంతరాల్లో దేనికై తపిస్తోందో నాకిప్పుడే స్ఫురిస్తోంది."

"ఏమిటది?" అడిగాడాయన ఆత్రంగా.

"స్వేచ్ఛ!.. నా ప్రభావంనుంచి విముక్తి"

"మరి దీనికి నీ సమాధానం?"

"మరేం లేదు. 'అన్యోన్యం' అంటే 'మమేకం' కాదని గ్రహించడమే."

Click here to share your comments on this story